సాక్షి కుమురం భీం

సోమవారం, 5, మే, 2025



బాసర చూసొద్దామా..
వందల ఏళ్ల కిందట బాసరను వ్యాసపూరి అని పిలిచేవారు. వ్యాసుడు నివసించడంతో గ్రామానికి ఆ పేరు వచ్చింది. కాలక్రమంలో వాసరగా.. బాసరగా మారింది. 10లో▸



గాలివాన బీభత్సం
జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం భారీ గాలులతో వడగళ్లు పడటంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. 11లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
38.4 /25.5
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత తగ్గుతుంది. సాయంత్రం ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి భూభారతి సదస్సులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలంలో ఈ నెల 5 నుంచి ఈ నెల 20 వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 7 వరకు దరోగపల్లి, చేడ్వాయి, అగర్‌గూడ, 8 నుంచి 12 వరకు పోతేపల్లి, లోడుపల్లి, మురళీగూడ. 13 నుంచి 15 వరకు బొంబాయిగూడ, ఎల్కపల్లి, కమ్మర్‌గాం, 16, 17, 19వ తేదీల్లో ఎల్లూరు, కొండపల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల్లోని రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలు, పలు ప్రారంభోత్సవాలు ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు దారులు గమనించాలని సూచించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజు భగీరథ మహర్షి జయంతి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చేందుకు సంవత్సరాలపాటు తపస్సు చేశాడని చరిత్ర చెబుతుందని తెలిపారు. మహనీయుల చరిత్ర, భారతదేశ విశిష్టతను భావితరాలకు అందించే విధంగా జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సజీవన్, సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, మాలి సంఘం నాయకులు శంకర్, అవుడపు ప్రణయ్, రుకుం ప్రహలాద్, అధికారులు పాల్గొన్నారు.

అర్హత పరీక్షకు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని డీఆర్‌సీ భవనంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌జీ రావు ట్రస్ట్ అర్హత పరీక్షకు స్పందన లభించింది. ఇంటర్మీడియెట్‌తోపాటు ఐఐటీ శిక్షణ, ఉచిత అడ్మిషన్ కోసం అర్హత పరీక్ష నిర్వహించగా 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్ట్ కాలేజీ ఇన్‌చార్జి దినేశ్ మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో పది మంది విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థుల ఆర్థిక స్థితికి అనుగుణంగా వారికి రెండేళ్లపాటు ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి, కార్యక్రమ కోఆర్డినేటర్ మధుకర్, ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు తిరుపతయ్య, మోహన్, శ్రీశైలం, త్రివేణి, రవికుమార్, వేణు, విష్ణు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి మూడు ముళ్లు!



- జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆగని బాల్యవివాహాలు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- గుట్టుచప్పుడు కాకుండా బాలికలకు పెళ్లిళ్లు



ఇటీవల బెజ్జూర్‌లో బాల్యవివాహం అడ్డుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

జిల్లా వివరాలు

సంవత్సరం	అడ్డుకున్న బాల్యవివాహాలు
2019	38
2020	29
2021	24
2022	23
2023	18
2024	15
2025	06(నేటివరకు)

పెంచికల్‌పేట్(సిర్పూర్): బాల్యవివాహాలు అరికట్టడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పక్కా సమాచారంతో అడపాదడపా అధికారులు అడ్డుకుంటున్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నా తల్లిదండ్రులు, సమాజం తీరులో మార్పు రావడం లేదు. ఆర్థిక ఇబ్బందులు, నిరాక్షరాస్యత, తొందరగా పెళ్లి చేస్తే బాధ్యతలు తగ్గుతాయనే ఆలోచనతో కుటుంబ పెద్దలు బాలికలకు చదువుకునే వయస్సులోనే పెళ్లి చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో బాలికలకు 16 ఏళ్లలోపే పెళ్లి చేసి వారి బాల్యానికి మూడు ముళ్లు వేస్తున్నారు. జిల్లాలో 2019 నుంచి నేటి వరకు జిల్లా అధికారులు 153 బాల్యవివాహాలు అడ్డుకుని కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారంతో అక్కడికి చేరుకున్న అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు. బెజ్జూర్ మండలం బారెగూడ గ్రామంలో కూడా బాల్యవివాహాన్ని అడ్డుకుని బాలల సంరక్షణ అధికారులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అవగాహన లోపంతో..

బాల్యవివాహాలు ఎక్కువగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. బాలికలకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా.. కుటుంబ ఆర్థిక పరిస్థితులతోపాటు దగ్గరి సంబంధాల పేరుతో తల్లిదండ్రులు వివాహం చేయడానికి మొగ్గు చూపుతున్నారు. పదో తరగతి పూర్తయిన బాలికలకు పెళ్లి చేసి బాల్యాన్ని బందీ చేస్తున్నారు. పెళ్లిళ్లు చేసే బాలికల సగటు వయస్సు 16 సంవత్సరాలు ఉంటే వీరిని 25 ఏళ్ల యువకులు వివాహం చేసుకుంటున్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం ద్వారా మైనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శారీరక ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత, అనారోగ్య శిశువులు జన్మించడం, శిశుమరణాలు, జన్యుపరమైన సమస్యలతో సతమతం అవుతున్నారు. చదువుకునే వయస్సులో కుటుంబ బరువు, బాధ్యతలతో బాలికలు తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

కఠిన చట్టాలు ఉన్నా..

బాల్య వివాహాలు అడ్డుకోవటానికి ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 2006 చట్టం ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే వరుడితోపాటు తల్లిదండ్రులు, పెళ్లికి హాజరైన బంధువులు, వివాహం చేసిన పురోహితులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించేందుకు ఆస్కారం ఉంటుంది. మైనర్ బాలికను వివాహం చేసుకుని జీవనం సాగిస్తే వరుడు, అతడి తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు, బంధువులపై పోక్సో చట్టం ప్రకారం పదేళ్ల నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

పేరుకే కమిటీలు..

బాల్యవివాహాలు నిరోధించడానికి ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. వీటిలో జిల్లాస్థాయిలో కలెక్టర్ బాల్యవివాహాల నిరోధక అధికారిగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, సీడీపీవో, మండల స్థాయిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రామస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు కమిటీలో ఉన్నారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగిన సమయంలో మాత్రమే అధికారుల దృష్టికి వస్తున్నాయి. వీటిని మాత్రమే అడ్డుకుంటున్నారు. అధికారుల దృష్టికి రాకుండా బాలికల బాల్యం మూడు ముళ్లలో చిక్కుకుపోతోంది. ఇప్పటికైనా బాల్యవివాహాలను అరికట్టడానికి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గుర్తించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అయినా చాలాచోట్ల తల్లిదండ్రులు వివిధ కారణాలను చూపుతూ రహస్యంగా పెళ్లిళ్లు చేస్తున్నారు. పక్కా సమాచారం ఉన్న వాటిని అడ్డుకుంటున్నాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలి. చట్టానికి విరుద్ధంగా బాల్య వివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేస్తాం. బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతిఒక్కరూ సహకరించాలి.
– బి.మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

నేడు జిల్లాకు ‘గడ్కరీ’



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

- జాతీయ రహదారి– 363ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ నగేశ్, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మంచిర్యాల జిల్లా నుంచి వాంకిడి వరకు రూ.3500 కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల జాతీయ రహదారి ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం జిల్లాకు రానున్నారు. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు స్టేజ్– 1, స్టేజ్– 2లో భాగంగా నిర్మించిన ఎన్‌హెచ్– 363ను రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద కేంద్ర మంత్రి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వాసవి జిన్నింగ్ మిల్లు వద్ద సభాస్థలితోపాటు కాగజ్‌నగర్ జిన్నింగ్ మిల్లు సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. నాగ్‌పూర్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా కేంద్రం మంత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా సభాస్థలికి చేరుకుని జాతీయ రహదారిని ప్రారంభించనున్నారు. అనంతరం సభలో ప్రసంగించి తిరిగి చెగూర్‌లోని కన్హాశాంతి వనం సందర్శనకు వెళ్లనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

కేంద్రమంత్రి పర్యటన కోసం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాట్లు చేశారు. సభకు సుమారు 15 వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. జపాన్ టెక్నాలజీతో కూడిన టెంటుతోపాటు ప్రజలకు భోజన, తాగునీటి వసతులు కల్పించనున్నారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దగ్గరుండి ఏర్పాట్ల పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా నిత్యం పరిశీలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీతో పాటు 9 మంది సీఐలు, 28 మంది ఎస్సైలు, సుమారు 300 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం కేటాయించారు. ఎక్స్‌రోడ్ వద్ద ఫ్లై ఓవర్‌కు రంగులు వేసి అందమైన బొమ్మలతో ముస్తాబు చేశారు. కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలోని వాసవి జిన్నింగ్ మిల్లు ఆవరణలో ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి పోలీసు అధికారులు, సిబ్బందికి బందోబస్తు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్, వీఐపీ పార్కింగ్, హెలిప్యాడ్, ఇతర ప్రాంతాల వద్ద బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ రమేశ్, రెబ్బెన సీఐ బుద్దే స్వామి, స్పెషల్ బ్రాంచి సీఐ రాణాప్రతాప్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇది..

ఉదయం 8.45 గంటలకు నాగ్‌పూర్‌లోని ఇంటి నుంచి బయలుదేరి, 8.55గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9 గంటలకు అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్‌కు బయలుదేరుతారు. 10.15 గంటలకు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.30 నుంచి 11.30 గంటల వరకు నేషనల్ హైవే 363ను ప్రారంభించి జాతికి అంకితం చేసి, అనంతరం ప్రసంగిస్తారు. ఉదయం 11.45 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి చెగూర్‌లోని కన్హాశాంతి వన సందర్శనకు బయలుదేరుతారు.

హాజరుకానున్న ప్రముఖులు

జాతీయ రహదారి– 363 ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథిగా హాజరు అవుతుండగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌తోపాటు రాష్ట్ర మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీలు దండె విఠల్, అంజిరెడ్డి, మల్క కొమురయ్య, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, వెడ్మ బొజ్జు పటేల్, పాయల్ శంకర్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్ హాజరు కానున్నారు.

‘నమో భారత్’కు మోక్షమెప్పుడో?

- సిర్పూర్ కాగజ్‌నగర్– హైదరాబాద్ మార్గంలో నడపాలంటున్న ప్రయాణికులు



నమో భారత్ రైలు

బెల్లంపల్లి: రైల్వే శాఖ ఆధునికీకరించిన నమో భారత్ ర్యాపిడ్ రైలుపై ప్రయాణికులు గొప్ప ఆశలు పెట్టుకున్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్–హైదరాబాద్ మధ్య ఈ రైలును నడపాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఆధునిక సౌకర్యాలతో తయారైన ఈ రైలు రాష్ట్ర రాజధానిని ముఖ్య నగరాలతో అనుసంధానం చేయడానికి రూపొందింది.

ఆధునిక సౌకర్యాల సమాహారం

నమో భారత్ ర్యాపిడ్ రైలు, గంటకు 130 కి.మీ. వేగంతో 300–350 కి.మీ. దూరం ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది. 12–16 ఏసీ చైర్‌కార్లతో, ఆటోమేటిక్ తలుపులు, ఆధునిక సౌచాలయాలు, చార్జింగ్ పోర్టులు, కవచ్ భద్రతా వ్యవస్థ వంటి సౌకర్యాలు ఈ రైలును ప్రత్యేకం చేస్తాయి. గుజరాత్, బిహార్‌లో ఇప్పటికే నడుస్తున్న ఈ రైలును తెలంగాణలో ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిర్పూర్–హైదరాబాద్ మార్గంలో నడపాలని..

సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ మధ్య భాగ్యనగర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ రెండు రైళ్ల మధ్య 7 గంటల వ్యవధి ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంది. నమో భారత్ రైలును ఈ రెండింటి మధ్యలో భాగ్యనగర్ తర్వాత నడిపితే ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని ప్రయాణికులు సూచిస్తున్నారు. ఈ మార్గంలో బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట, జనగాం, భువనగిరి వంటి స్టేషన్‌లలో హాల్టింగ్ కల్పించాలని కోరుతున్నారు.

పుష్కరకాలంగా నిరీక్షణ..

పుష్కర కాలంగా సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గంలో కొత్త రైళ్లు ప్రవేశపెట్టకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రైళ్లు తప్పా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈమార్గంలో పట్టాలెక్కిన కొత్త రైలు లేదు. 90శాతం మూడో రైల్వేలైన్ పూర్తయినా, కొత్త రైళ్లు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పెద్దపల్లి, ఆదిలాబాద్ ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఈ రైలు ప్రవేశపెట్టేందుకు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అన్ని ముఖ్య స్టేషన్లలో హాల్టింగ్ కల్పిస్తే, రైల్వే ఆదాయంతోపాటు ప్రయాణికుల సౌకర్యం పెరుగుతుంది.

తాగునీటి కటకట

- జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో మొదలైన నీటి గోస
- ఎండిపోయిన నీటివనరులు
- నిరుపయోగంగా మారిన చేతిపంపులు
- అవస్థలు పడుతున్న భక్తులు



ఎండిపోయే దశలో టొప్లకస

కెరమెరి(ఆసిఫాబాద్): ఎండ తీవ్రతకు జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఆదివాసీల పుణ్యక్షేత్రం జంగుబాయి ఆలయం వద్ద కూడా తాగునీటి కటకట మొదలైంది. నీరు ఇంకిపోవడంతో ఆలయం ప్రాంగణంలోని చేతిపంపు గత నెల నుంచి నిరుపయోగం మారింది. భక్తులు పవిత్రంగా భావించే టొప్లకసలో కూడా నీరు అడుగంటిపోతోంది. ఇటీవలే విత్తన పూజలు ప్రారంభం కాగా, భక్తులు భారీగా తరలివస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారంతా మహరాజ్‌గూడ నుంచి తాగునీటిని తెచ్చుకుని కాలం వెల్లదీస్తున్నారు. ఇరు రాష్ట్రాల పర్యవేక్షణలో ఉన్న జంగుబాయి ఆలయ సమస్యలపై తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఏటా ఇదే తంతు

ఆలయంలో ఏటా రెండుసార్లు జంగుబాయి ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం ఇదే తీరుగా నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. పుష్యమాసం సందర్భంగా డిసెంబర్, జనవరిలో జరిగిన ఉత్సవాలకు మాత్రం ఐటీడీఏ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్థానిక ముకదంగూడ, ఇతర ప్రాంతాల నుంచి పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న విత్తన పూజలకు మాత్రం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. మూడేళ్ల క్రితం ఆలయ ప్రాంగణం వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు చేతిపంపులు ఏర్పాటు చేసింది. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. అమ్మవారికి దర్శనానికి వచ్చే భక్తులు సాధారణంగా చెప్పులు లేకుండా వస్తుంటారు. ఇలాంటి తరుణంలో నీటి కోసం ఎండలో రెండు కిలోమీటర్ల దూరంలోని మహరాజ్‌గూడకు వెళ్లిరావడం ఇబ్బందిగా మారింది. ఇక్కడి పరిస్థితి తెలిసిన కొందరు మాత్రం ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై డ్రమ్ముల్లో సొంతంగా నీటిని తెచ్చుకుంటున్నారు.



పనిచేయని బోరు

స్నానాలకు ఇబ్బందులే..

వేసవి కావడంతో సమీప అటవీ ప్రాంతంలోని నీటి వనరులు కనుమరుగైపోయాయి. నియమ, నిష్టలతో వచ్చే భక్తులు రాత్రిపూట ఆలయం వద్దే గడుపుతారు. వారికి స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఏర్పాట్లు లేవు. మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. గతంలో టొప్లకస వద్ద స్నానాలు చేసేవారు. ప్రస్తుతం అక్కడ నీళ్లు అడుగంటిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆలయంలో తాగునీటి అవస్థలు తీర్చేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదివాసీలు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ఏటా విత్తన పూజల కోసం జంగుబాయి అమ్మవారి ఆలయానికి భారీగా ఆదివాసీలు తరలివస్తారు. పుష్యమాసంలో నిర్వహించిన ఉత్సవాలకు చేతిపంపులు, ఇతరప్రాంతాల నుంచి సరఫరా చేసే నీటితో అవసరాలు తీర్చుకున్నాం. ఎండలకు ప్రస్తుతం చుక్కనీరు లేదు. జంగుబాయి ఆలయం వద్ద తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
– పుర్క బాపూరావు, ఉత్సవ కమిటీ ప్రచార కార్యదర్శి

ప్రశాంతంగా నీట్







ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 287 మంది విద్యార్థులకు 272 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారు. పోలీసులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వచ్చిన ముగ్గురిని అనుమతించలేదు. కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆసిఫ్, ఆదిలాబాద్‌కు చెందిన నాగేశ్వర్, దహెగాంకు చెందిన నికిలేశ్ ఆలస్యంగా రావడంతో వారిని కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను నిబంధనల ప్రకారం పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని అధికారులను ఆదేశించారు. కాగా, కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. నీట్ సమన్వయకర్త లక్ష్మీనర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాడుతున్న 15 మంది అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పేకాడుతున్న 15 మందిని శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ ఫణిధర్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 89,160 నగదు, 13 సెల్‌ఫోన్లు, ఆరు బైక్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: బోథ్ శివారులో ఆదివారం పేకాడుతున్న ఐదుగురిని ఎస్సై ప్రవీణ్ కుమార్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మహేందర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ముందు ఓ వ్యక్తి నుంచి గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒకరు గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రం సిహోర్‌కు చెందిన మహ్మద్ మన్సూర్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 240 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నందకుమార్ మృతదేహం

నేరడిగొండ: మండలంలోని దూద్‌గండి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం గేర్జం గ్రామానికి చెందిన యువకుడు జూగ్నక్ నందకుమార్ (27) బైక్‌పై నిర్మల్‌కు పని నిమిత్తం బయల్దేరి వెళ్లాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నందకుమార్‌పై లారీ వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీడ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాసర చూసొద్దామా..

- చదువుల తల్లి..సరస్వతి అమ్మవారు
- వింతలు, విశేషాల సమాహారం
- ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ



బాసర ప్రధాన ఆలయం

భైంసా: చదువుల తల్లి కొలువుదీరిన బాసర ఇప్పుడు చూసేవారికి ఒకే గ్రామం. అమ్మవారు కొలువైన ఊరని అందరికి సుపరిచితమే. వాస్తవానికి బాసర ఏడు గ్రామాల సమాహారం. వందల ఏళ్ల కిందట బాసరకు వ్యాసపూరి అని పిలిచేవారు. వ్యాసుడు నివసించినందుకు గ్రామానికి ఆ పేరు వచ్చింది. వ్యాసపూరితోపాటు దానిచుట్టూ రత్నాపూర్, రేణుకాపూర్, మాదాపూర్, రవీంద్రాపూర్, మైలాపూర్ గ్రామాలు ఉండేవి. మహ్మదీయుల కాలంలో తరచూ దాడులు, బందిపోట్లు, రజాకార్ల నియంతృత్వాన్ని, ఆకృత్యాలు ఎదురించేందుకు ఈ పల్లెలు ఒక్కటిగా మారి వాసర పేరుతో ఏకమయ్యాయి. కాలక్రమంలో వాసర బాసరగా మారింది. గ్రామానికి ఒక హనుమాన్ మందిరం ఉంటుంది. ఏడు ఊర్ల సూచికగా బాసరలో ఏడు హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. ఆ గ్రామాలు అప్పుడున్న స్థలంలో ఇప్పటికీ హనుమాన్ ఆలయాలున్నాయి. బాసర రైతులు సాగుచేసే భూముల్లో పురాతన ఆలయాల ఆనవాళ్లు కనిపిస్తాయి. ఇప్పటికి రెవెన్యూ రికార్డుల్లో సైతం ఆ గ్రామాల పేర్లు ఉన్నాయి.

పట్వారీగా పనిచేసి యువకులను ఐక్యం చేసి..

అప్పటి రేణుకాపూర్ గ్రామ పట్వారీగా పనిచేసే మక్కాజీ పటేల్ యువకులను ఐక్యం చేసి అమ్మవారి ఆలయాన్ని కాపాడాడు. మహ్మదీయుల పాలనలో బాసర తరచూ ముష్కరుల దోపిడీకి గురయ్యేది. ఆలయంలో విగ్రహాల ధ్వంసం, అమ్మవారి ఆభరణాలు, కానుకలు అపహరించేవాళ్లు. పట్వారీ మక్కాజీ పటేల్ నిరంతరం గస్తీకాస్తు తురుష్కుల దండయాత్రలను ఎదురించాడు. బందీపోట్ల దాడులను సమర్థంగా ఎదుర్కొన్నాడు. భక్తులకు, గ్రామానికి రక్షణగా నిలిచాడు. ఆ సమయంలోనే పక్కనే ఉన్న ఆరు గ్రామాలు బాసరలో విలీనమయ్యాయి. ఆలయాన్ని కాపాడిన ఆయన విగ్రహం ఇప్పటికి గర్భగుడి పక్కనే గల దత్తాత్రేయ మందిరం గోడను ఆనుకుని ఉంటుంది.

పుణ్యస్థలి ఇది..

బాసర వ్యాసమహర్షి సృష్టి. అవ్యక్త రూపిణిగా ఉన్న అమ్మవారిని తన మనోనేత్రంతో చూసి దీక్షతో ప్రతిష్ఠించిన వ్యాసుని హితిహాసం అందరికి తెలిసిందే. అయితే పలు కారణాలతో దేవతలు ఇక్కడ సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. బాసర ఆలయం చెంత అష్టముఖి కోనేరు కనిపిస్తుంది. 8 దిక్కుల్లో 8 మంది దేవతలు సరోవరం చుట్టూ స్నానమాచరించి నివసించిన స్థలాలుగా ఇప్పటికి భావిస్తారు. పురాణగాథల పరంగా శాపగ్రస్తులైన ఇంద్రుడు, సూర్యుడు, వినాయకుడు, విష్ణువు, వాల్మీకి, శంకరుడు అమ్మవారిని పూజించి శాపవిముక్తులైనట్లు తెలుస్తోంది. దేవతల రాజైన ఇంద్రుడి గుడి లోకాలకు వెలుగునిచ్చే సూర్యుని ఆలయం ఇక్కడ ఉంది. ఈ విషయం వెలుగులోకి రాలేదు.

బస్సుకు ముందే రైలు వచ్చింది

బస్సు రాక ముందే బాసరలో బల్బు వెలగకముందే రైలు వచ్చిందని స్థానికులు ఇప్పటికి చెబుతుంటారు. ఆంగ్లేయులు పరిపాలించిన ఉత్తర భారతంతో పోలిస్తే నిజాంల ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతంలో రైల్వే వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందలేదు. అప్పుడప్పుడే ఆధునిక నాగరికత పురుడు పోసుకుంటున్న సమయంలోనే బాసరకు రైలు మార్గం ఏర్పడింది. మరట్వాడా ప్రాంతంలో 30 లక్షల ఎకరాల్లో సాగయ్యే పత్తి పంటను జిన్నింగ్ మిల్లులు ఉన్న ఔరంగాబాద్, జల్నా పట్టణాలకు చేర్చడానికి తన రాజధాని హైదరాబాద్‌కు అనుసంధించడానికి నిజాం ప్రభువు 1899లో గోదావరి ర్యాలీ రైల్వేపేరుతో రైలు మార్గం ఏర్పాటు పనులు ప్రారంభించాడు. 1902లో 623 కిలోమీటర్ల రైలుమార్గం నిర్మించి రాకపోకలు ప్రారంభించాడు. బాసరకు బస్సు రాక ముందే రైలు వచ్చిందని ఈ ప్రాంతవాసులు ఇప్పటికి చెబుతుంటారు.

రాతిశిల వింత ధ్వనులు



వేదవతి శిల

బాసర బస్టాండ్ సమీపంలో రాతిశిల వింత ధ్వనులను వినిపిస్తుంది. స్థానికులు వేదవతి శిల అని పిలుస్తారు. బండరాయితో ఈ శిలను కొడితే వీణ తీగలను మీటినట్లు, కంచుపాత్రలను కొడితే వచ్చే శబ్దంలా వినిపిస్తాయి. ఈ శిలలో అమ్మవారి ఆభరణాలు ఉన్నాయని అంటుంటారు. రాతి వేదికపై నిలబడినట్లు ఉండే ఈ వేదవతి శిలను భక్తులు దర్శించుకుంటారు.

పాపహరేశ్వర ఆలయం

బాసర విశిష్టతకు, వైభవానికి పాపహరేశ్వర ఆలయం చిరునామా. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయం బాసర చరిత్రకు సజీవ సాక్ష్యం. అద్భుత శిల్పకలతో అలరారిన ఈ రాతి నిర్మిత ఆలయం చూసేందుకు భక్తులు ఆసక్తి కనిపిస్తుంటారు. నాలుగు దిక్కుల నాలుగు రాతిమండపాలు పుష్కరిని ఇక్కడ కనిపిస్తుంది. పరుశురాముడే పాపహరేశ్వర ఆలయాన్ని నిర్మించాడని చెబుతుంటారు.



పాపహరేశ్వర ఆలయం

అటవీహక్కు భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని పిప్రి శివారు గల అటవీ హక్కు భూములను ఐటీడీఏ అధికారులు ఆదివారం పరిశీలించారు. గ్రామ రైతులతో కలిసి ఐటీడీఏ డీడీ జాదవ్ అంబాజీ వాటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాదవ్ మాట్లాడుతూ సోలార్ జల వికాసంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పైలెట్ ప్రాజెక్టును త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభిస్తారన్నారు. ఈ క్రమంలో పిప్రిలో అటవీ హక్కు పత్రాలున్నా భూములను పరిశీలించినట్లు తెలిపారు. డీటీ రాథోడ్ సరోజి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, కాంగ్రెస్ నాయకులు కోడప శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎయిర్ పిస్టల్ కలకలం

- మావల చెరువు సమీపంలో లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల చెరువు సమీపంలో ఆదివారం ఎయిర్ పిస్టల్ కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు దీన్ని పారేయడంతో అటువైపు వెళ్తున్న గ్రామస్తులు చూసి ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయమై మావల పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని ఎయిర్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇది ఆయుధాలకు సంబంధించిన పిస్టల్ కాదని, ఎయిర్ పిస్టల్ అని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. దీనికి ఎలాంటి లైసెన్స్ అవసరం ఉండదని, ఎగ్జిబిషన్‌లో బెలూన్లు పగులగొట్టడానికి వినియోగిస్తారని పేర్కొన్నారు. ఎవరు పడేసి ఉంటారోననే కోణంలో విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

పాముకాటుకు వివాహిత మృతి



నేరెళ్ల రజిత(ఫైల్)

కడెం: పాముకాటుకు వివాహిత మృతిచెందిన మండలంలోని పెద్దూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..పెద్దూర్‌కు చెందిన నేరెళ్ల రజిత (35), దాసు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అద్దె ఇంటి డబ్బుల భారంతో గత కొన్నినెలలుగా పెద్దూర్ సమీపంలోని డబుల్ బెడ్రూం ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి పరిసరాల్లో రజిత తోటకూర తెంపుతుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను కడెంలో ప్రథమ చికిత్స చేయించి, నిర్మల్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. తల్లి మృతదేహం వద్ద కూతుళ్ల రోదన అందరిని కంటతడి పెట్టించింది. పెద్ద కూతురు వివాహం నిశ్చయం కాగా, అంతలోనే తల్లి మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఎన్నిక

ఇంద్రవెల్లి: ఉమ్మడి జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని మండలకేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ హక్కుల పోరాట సమితి(ఏపీఎస్‌హెచ్‌పీఎస్)తో నామకరణ అనంతరం ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా దుర్వ నగేశ్, గౌరవ అధ్యక్షుడిగా ఉయిక సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గేడం నిరంజన్, ఉపాధ్యక్షుడిగా గేడం భరత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనక ప్రభాకర్, కార్యదర్శిగా పెందోర్ అంకుష్, కన్వీనర్‌గా పెందోర్ మారుతి, కోకన్వీనర్‌గా ఆడా కాంతారావ్, కోశాధికారిగా సిడాం వామన్‌రావ్, సలహాదారుగా తొడసం ప్రశాంత్, గేడం జ్ఞానేశ్వర్, ఆర్క ఖమ్ము, మడావి లక్ష్మణ్, మెస్రం శేషనారాయణ్, పెందోర్ ధర్ము, కోవా వినోద్, కుర్సెంగా యాదవ్‌రావ్, పూసం నాందేవ్ ఎన్నికయ్యారు.



ఎన్నికపై చర్చిస్తున్న పర్ధాన్ సమాజ్ పెద్దలు

సత్ఫలితాలిస్తున్న గడ్డిమైదానాలు

- వన్యప్రాణుల సంతతి వృద్ధికి చర్యలు
- వచ్చే వర్షాకాలంలో పెంచేందుకు అటవీశాఖ దృష్టి
- జన్నారం అటవీ డివిజన్‌లో విత్తనాల సేకరణ
- భద్రపర్చే పనిలో అధికారులు



విత్తనాల కోసం ఎండిన గడ్డిని కోస్తున్న సిబ్బంది

జన్నారం: వన్యప్రాణుల సంతతి వృద్ధి కోసం గత ఆరేళ్లుగా జన్నారం అటవీ డివిజన్‌లో పెంచుతున్న గడ్డి మైదానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వచ్చే వర్షాకాలంలో వాటిని విరివిగా పెంచేందుకు అటవీ శాఖ దృష్టి సారించింది. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ జన్నారం, ఇందన్‌పెల్లి, తాళ్లపేట రేంజ్‌లో వన్యప్రాణులు ఇష్టపడి తినే గడ్డి విత్తనాలు సేకరించి, భద్రపర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత సంవత్సరం వరకు 800 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మరో 62 ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గడ్డిని విరివిగా పెంచేందుకు..

అడవిలో వన్యప్రాణులు గడ్డిని తినేందుకు అధికారులు గత ఆరేళ్ల క్రితం గడ్డి మైదానాలు ఏర్పాటు చేశారు. నిపుణుడు మురద్కర్ ఇక్కడి అధికారులకు శిక్షణ ఇచ్చారు. వన్యప్రాణులు గడ్డిని తినేందుకు ఇష్టపడతాయని, గడ్డి పెంపకం ద్వారా వాటి సంఖ్య పెరుగుతుందని, దీంతో ఈ ప్రాంతంలో పులులు ఆవాసం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. క్లోరిస్‌బాల్ బుటా, గ్‌లె క్షుంటజం, డిజిటేరియా, ఐసోలియా తదితర పాటు మొత్తం 12 రకాల గడ్డి జాతులను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గడ్డి పెంపకం ద్వారా పులి గడ్డిమాటున వన్యప్రాణులను సులభంగా వేటాడే అవకాశం ఉందని అధికారుల యోచన.

సేకరించి, భద్రపర్చి..

అడవిలో సహజసిద్ధంగా పెరిగిన గడ్డి నుంచి విత్తనాలు సేకరిస్తారు. వీటినిపొడిగా చేయడానికి ఎండలో ఆరబెడుతారు. తర్వాత పాలిథిన్ కవర్లలో వాటిని భద్రపరుస్తారు. సంచుల్లో నింపి తేమ తగులకుండా గదిలో ఉంచుతారు. వర్షాకాలం రాగానే విత్తనాలను అనుగుణంగా ఉన్న ప్రాంతాల్లో చల్లుతారు. అదేవిధంగా మొక్కల, చెట్ల విత్తనాలను దట్టమైన అటవీ ప్రాంతంలో చల్లడంతో గడ్డి పెరుగుతుంది. కొన్ని గడ్డిజాతులు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో పెరిగి విత్తనాలు రాగా, మరి కొన్ని జాతులు జనవరి నుంచి ఏప్రిల్ మధ్యలో విత్తనాలు ఇస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

ముందంజలో జన్నారం డివిజన్

గడ్డి మైదానాల ఏర్పాటులో జన్నారం అటవీ డివిజన్ ముందుంజలో ఉంది. వివిధ అటవీ డివిజన్, టైగర్‌జోన్ ప్రాంతాల నుంచి అధికారులు జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించి, గడ్డి క్షేత్రాల నిర్వహణ, చేపడుతున్న పనుల తీరును తెలుసుకుంటున్నారు. వారి ప్రాంతంలో గడ్డి క్షేత్రాలు పెంచుతున్నారు. వన్యప్రాణుల కోసం అక్కడే నీరు, ఆహారం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

మరో 62 ఎకరాల్లో ప్రతిపాదనలు



జన్నారం అటవీ డివిజన్‌లో ఇప్పటివరకు 800 హెక్టర్ల వరకు గడ్డి మైదానాలు ఏర్పాటు చేశాం. వచ్చే వర్షాకాలంలో మరో 62 ఎకరాల్లో పెంచనున్నాం. ఇందుకు తగిన ప్రతిపాదనలు పంపాం. విత్తనాలు సేకరించి, భద్రపర్చాం. అనువైన ప్రాంతంలో చల్లి సహజ సిద్ధంగా గడ్డి పెరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ సేకరించిన విత్తనాలను ఇదే డివిజన్‌లో కాకుండా అవసరం ఉన్న చోట వినియోగిస్తున్నాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

కొత్త గనులు సాధించుకోవాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: రాష్ట్రంలో కాలం చెల్లిన పాత గనులు మూతపడుతాయని, కొత్త గనులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 26 నియోజకవర్గాల్లో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో అతిపెద్ద సంస్థ సింగరేణి అని పేర్కొన్నారు. గనులతోనే నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సింగరేణి షేప్ నిధులతో పారిశ్రామిక ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. మూసివేసిన గనుల స్థానంలో కొత్త గనుల ఏర్పాటు విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో గర్మిళ్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో మందమర్రి సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

జిల్లాకేంద్రంలోని గర్మిళ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మంచిర్యాలలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గర్మిళ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు సందడి చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటిగురువులు పీఎస్ చారి, దాసరి శ్రీనివాస్, మాలవీదేవి, ప్రభులింగం, భీమ్‌రావుతోపాటు ప్రస్తుత హెచ్‌ఎం కరుణాకర్‌ను సన్మానించారు. మాజీ ఎంపీపీలు బేర సత్యనారాయణ, శారద (సారంగపూర్), తహసీల్దార్ గోవింద్ తోపాటు మురళీ, రమేశ్, దీప, గోపి, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు. మంచిర్యాలలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో మందమర్రి సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

– మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్

1,270 దేశీదారు బాటిళ్లు స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్, రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అక్రమంగా మహారాష్ట్ర నుంచి జిల్లా కేంద్రానికి దేశీదారు బాటిళ్లను ఆటోలో తరలిస్తున్న ఇద్దరిపై దాడి చేసి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్, వడ్డెర కాలనీలకు చెందిన సూర రవి, చింతల సుజాత మహారాష్ట్ర నుంచి ఆటోలో దేశీదారు బాటిళ్లు తరలిస్తున్నట్లు సమాచారంతో డొల్లార శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 1,270 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.45,720 ఉంటుందని పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ముత్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్బర్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న దేశీదారు బాటిళ్లు

ప్రైవేట్ బస్సును ఢీకొన్న ఆటో

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44 పై సీతాగొంది గ్రామ సమీపంలో ఆదివారం ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. మండలంలోని హర్కాపూర్‌కు చెందిన కొందరు ఆటోలో మన్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తోంది. సీతాగొందిలో గుడిహత్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ భీంరావుతోపాటు శాంతాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు లస్మన్న, పోసాని, గురుజ గ్రామానికి చెందిన నేతుల వనజ, అను, సౌమ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికుల సహాయంతో 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్య



వైష్ణవి (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని గంగాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన వడాయి రవీందర్–రుకుంబాయి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో చివరి సంతానమైన వైష్ణవి (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కళాశాలకు వేసవి సెలవులు రావడంతో ఇంటివద్దే ఉంటోంది. గత నెల 29న తల్లిదండ్రులు వ్యవసాయ పని ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. వైష్ణవి ఏ పని చేయకుండా ఖాళీ కూర్చుని ఉంది. చదువు ఒక్కటే సరిపోదు రోజు కష్టపడి పని చేసి ఇంటికి వచ్చి అన్నం వండుతున్న అమ్మకు కాస్త సహాయం చేయవచ్చు కదా అంటూ తండ్రి మందలించాడు. ఆరోజు ఆమె రాత్రి భోజనం చేయకుండా తన గదిలోకి వెళ్లింది. ఆ తర్వాత వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు అడుగగా గుర్తుతెలియని పురుగుల మందు తాగానని చెప్పింది. వారు వెంటనే ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఆదివారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే వైష్ణవి మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.